

చూస్తూండగానే అతని ముఖం చాటంతయింది. రొయ్యలాంటి మీసం మరిబారెడు సాగింది. హఠాత్తుగా లేచి నిలుచున్నాడు. టేబుల్ మీదున్న పాత దినపత్రికను అందుకొని, ఒకసారి ఎగిరి గంతేశాడు. 'బ్రహ్మయ్యా! నీది మట్టి బుర్రేగాని, ఒక్కోసారి ఇలాంటి సమయాలలో మహా యమగా పనిచేస్తుందోయ్!' అని తన భుజంమీద తట్టుకొని, ఈల వేస్తూ, ఆ గదిలోంచి బయటకు దూకాడు. మామూలులాగే పరధ్యానంగా ఢీకొన్న అఫీస్‌బాయ్‌మీద ఈ మారు మండిపడలేదు. మెట్ల ప్రక్కన టైపిస్ట్ అమ్మాయి సీటులో కూర్చుని ఏదో అర్జంట్ ఉత్తరాన్ని టైప్ చేస్తూన్న అక్కౌంటెంట్ బుగ్గమీద చిటిక వేసి, ఆ అలవాటులో పొరబాటును గమనించకుండానే దూకుడుగా తన భాగస్వామి గదిలోకి ప్రవేశించాడు. "మై డియర్ స్వామీ, నా భాగస్వామీ! ఇంకో క్షణంలో నే నిక్కడ ఓ ఆటంబాంబ్ వేయబోతున్నా, సిద్ధంగా ఉండు," అన్నాడు.

బ్రహ్మయ్య విచిత్ర వాలకానికి స్వామి గుడ్లు తేలవేసి, కుర్చీలోంచి అమాంతంగా లేవబోయాడు.

"అరెరే...కూర్చోవయ్యా; నిజంగా బాంబు వేసేస్తా ననుకుంటున్నా వేమిటి? బాంబులాంటి సలహా—అంతే!" అంటూ బ్రహ్మయ్య ఎదురుగా ఒక కుర్చీలో కూర్చున్నాడు.

స్వామి ఇంకా విస్మయంలోంచి తేరుకోలేదు.

"ఆ సలహా ఏమిటని అడగవేం? సరే... నువ్వడిగేలోగా నా కొండంతఉత్సాహం అంతా చల్లారిపోయి నేను చప్పబడిపోతానేమో—అందుచేత నేనే చెప్పేస్తా." అంటూ బ్రహ్మయ్య తన చేతిలోని పాత దినపత్రికను తన భాగస్వామి ముందు పడేసి, "ముందు ఈ ఫోటోను చూసి, తర్వాత దాని కింద ఉన్న వార్తను చదువు. ఈ దెబ్బతో మన 'స్వామి అండ్ బ్రహ్మయ్య' కంపెనీవారు తయారు చేసే 'ఏనుగు' మార్కు ఇనప్పెట్టెలకు విశేషంగా ప్రచారం లభించి, మార్కెటులో

విపరీతమైన గిరాకీ ఏర్పడిపోవడం ఖాయం," అన్నాడు.

పేపర్‌ను మడిచి, పెదవి విరుస్తూ, "ఓస్ ఇంతేనా ... నేనేమిటో అనుకొని ఉక్కిరిబిక్కిరి అయిపోయాను. ఈ దొంగ వీరడు గురించి నాకు తెలిదేమిటి?" అన్నాడు స్వామి.

"ఇటుపైన మన ఇనప్పెట్టె అడ్వర్ టైజ్‌మెంట్లను పత్రికల్లో వేసేటప్పుడు ఈ దొంగవీరడి ఫోటోనుకూడా కొంత కాలంపాటు ప్రచురిస్తూంటాం. ఎలా ఉంది మన ఐడియా?" పళ్ళు ఇకిలించాడు బ్రహ్మయ్య.

"ఏడ్చినట్లే ఉంది. ఇనప్పెట్టెలు తెరవడంలో మొనగాడనిపించుకున్న దొంగ ఫోటోను మన ప్రకటనలో వేయించడమా? నీ కేమైనా పిచ్చిపట్టలేదుకదా?"

బ్రహ్మయ్య ఫకాలున నవ్వాడు. "అదికాదు, మిత్రమా...మనం మామూలుగా ప్రకటనలో ఏం వేస్తున్నాం? మన ఇనప్పెట్టెలు కొన్నట్లు ఒకరిద్దరు కుంటల ఫోటోలో, పక్షిఫోటోలో వేసి, 'నేను ఎల్లప్పుడూ ఈ ఏనుగుమార్కు ఇనప్పెట్టెలనే ఉపయోగింతును' అంటూ వాళ్ళొక ముష్టి యోగ్యతాపత్రాన్ని మన ముఖం మీద పారేసినట్లు వేస్తూవచ్చామా ఇంత వరకు? మన అమ్మకాలు ఏమాత్రమైనా పెరిగాయా? తోటి వ్యాపారస్థుల పోటీకి తట్టుకోగలమా? అందుకని ఈమారు మనం ఒక పెద్ద పబ్లిసిటీ స్టంటు వేసి, ప్రజలలో పెద్ద సంచలనం కలిగించబోతున్నాం. ఎటువంటి ఇనప్పెట్టె తలుపులనైనా అవలీలగా తెరవగల ఈ దొంగవీరడు మన ఏనుగుమార్కు ఇనప్పెట్టెలకు ఒక యోగ్యతాపత్రం ఇస్తాడన్నమాట."

"చాల్లేవయ్యా — ఎవరైనా వింటే నవ్విపోతారు."

"అసలు నువ్వు పూర్తిగా వింటేనా మరి?...కాస్సేపు నీ చెవులను నాకప్పగించు...మనం ఒక పెద్ద ఎత్తు వేయబోతున్నాం. ఒక పబ్లిక్ ఫంక్షన్‌ను ఏ హాలులోనో ఏర్పాటు చేస్తామన్నమాట. దానికి నగరంలోని వర్తకులను, ధనికులను, రాజకీయవేత్తలను, ప్రతికలవారిని- ఎందరినో ఆహ్వానిస్తాం. ఈ పెద్ద మనుష్యులందరి సమక్షంలో దొంగవీరడు మన ఇనప్పెట్టె ఒకదాని తలుపులను తన మామూలు పద్ధతిలో తెరవడానికి ప్రయత్నిస్తాడన్నమాట...వాడు తల కిందపెట్టి నిలుచొని తపస్సు చేసినా — మన ఏనుగు మార్కు ఇనప్పెట్టె తలుపులను తెరవలేడు కదా?"

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?"

"నేనింతవరకు మాట్లాడిందంతా నీకు తెలిసిందా?"

"అది కాదయ్యా...ఏడాది క్రితం ఏడవసారి జైలునించి విడుదలైనప్పట్నుంచీ ఈ దొంగవీరడు పూర్తిగా మారిపోయాడనీ, మళ్ళీ అలా ఇనప్పెట్టెలు పగులగొట్టిన కేసులేవీ అతనిమీదకు రాలేదనీ కుడా ఈ పత్రికలోనే ఉందిగా?"

"ఉంటేయేం...? దొంగవీరడు నిజంగానే మారిపోయి ఉండొచ్చు. అంటే, అతనిప్పుడు పొట్ట పోసుకోడానికి చాలా కష్టపడుతుండాలి. మన ఇనప్పెట్టెల ప్రచారానికి ఈ విధంగా తోడ్పడినందుకు వాడికి తృణమో పణమో మనం ముట్టజెప్తాంకదా? ఇక వాడెందుకు ఒప్పుకోడు? మరి నా ఐడియా యమగా ఉందన్న ముక్క నీ నోటివరకైనా ఇంకా వచ్చిందా - లేదా?"

"వచ్చిందే అనుకో..."

"అది చాలు. సరే, నేను వెంటనే వీరడి ఇల్లు ఎక్కడుందో వాకబు చేసి, వాడ్నొకసారి కలుసుకొని మరీ వస్తా," అంటూ బ్రహ్మయ్య ఎకాయెకీన బయలుదేరాడు.

* * * *

ఆ చీకటి కొంపలో శుష్కించిపోయిన దేహంతో ఓ మూల బిక్కుబిక్కుమంటూ కూర్చొనున్న వీరడ్ని చూడగానే — ఒకప్పుడు ఆరితేరిన గజదొంగగా పేరు మోసింది ఇతడేనా అని మొదట విస్తుపోయాడు బ్రహ్మయ్య. తర్వాత తన రాకకు కారణం వివరించాడు.

వీరడు తల విదిలిస్తూ, "ఇటుపైన ఇనప్పెట్టె తలుపులు తెరవకూడదని ఒట్టేసుకున్నా, బాబయ్యా?" అన్నాడు.

"అది బాగానే ఉంది. కాని, ఈ విషయంలో నువ్వు నేరమేమీ చెయ్యడం లేదుగా? ఇందులో న్యాయవిరుద్ధమైనదేమీ లేదు. మా కోర్కెమేరకు ఇనప్పెట్టెలు తెరవడంలో ఘటికుడైన దొంగవీరడు —"

"బాబూ, దయచేసి ఇటుపైన ఆ మాట అనకండి."

"సరే...అనునులే... చూడూ! పత్రికల్లో సరకుల గురించి ఏవేవో ప్రకటనలు వేస్తూంటారు. వాటిని అడ్వర్‌టైజ్‌మెంట్స్ అంటూంటారు."

"అవును లెండి."

"ఐతే, నువ్వు పత్రికలు చూస్తూంటావన్నమాట... ఇకనేం - త్వరలో కొన్ని పత్రికల్లో నీ ఫోటోను కూడా చూసి మురిసిపోగలవు."

వీరడు నవ్వుతూ, "నా ఫోటో ఇదివరకే చాలా పత్రికల్లో పడిందయ్యా," అన్నాడు.

"పడిందిలే. ఆ విషయం నాకు తెలియదు గనుకనా? ఐతే, ఎలా పడింది? దొంగ వీరయ్యగా పడింది. అవునా? ఈ మారు అలా కాదు; పెద్దమనిషి వీరయ్యగా పడుతుందన్నమాట... అంటే, నువ్వు మా ఏనుగుమార్కు ఇనప్పెట్టెలు చాలా బలమైనవని ఒక సర్టిఫికెట్ పారేస్తావన్నమాట. తెలిసిందా? నిజానికి మా ఇనప్పెట్టెల తలుపులను బిగాలు లేకుండా బలవంతంగా తెరవడానికి బ్రహ్మతరం కుడా కాదులే."




"ఆ మాటతో నే నొప్పుకో లేను, బాబయ్యా. కావలసిన పనిముట్లుంటే, ఎంత లావుపాటి ఇనప్పెట్టెనైనా—మూల నున్న ముసలమ్మకూడా తెరిచేయగలదు. ఐనా, ఇప్పుడావిషయం ఎందుకులెండి. నే నా వృత్తిని మానేశాగా?"

"మరిప్పుడెలా పొట్టపోసుకుంటున్నావ్—సరే, ఆ విషయాని కేంగాని. వీరయ్యా, బాగా ఆలోచించు. మా కంపెనీ నీకు నూటపదహార్లు ఇనాంగా ఇస్తుంది. నువ్వు చేయవలసిందల్లా—నీకు తెలిసిన కిటుకులంతా ఉపయోగించి, మా ఇనప్పెట్టె తలుపులు తెరవడం, అంతే. నీకు రెండుగంటల టైమ్ ఇస్తాం. నీ తెలివితేటలను స్వయంగా చూసి ఆశ్చర్యపోవడానికి ఆనాడు ఎందరు వస్తారనుకున్నావ్? పెద్దపెద్ద వర్తకులు, పత్రికా విలేఖర్లు, పోలీసువారు..."

"పోలీసోళ్ళా!" వీరడు తృళ్ళిపడ్డాడు.

"వాళ్ళుకూడా నీ నేర్పరితనాన్ని చూడడానికే వస్తారు. నీ కెందుకు భయం? వాస్తవానికి నువ్వసలు ఏ నేరమూ చేయడంలేదుగా? మా కోర్కెమీద ఆ పని చేస్తున్నావాయె. అంతే ... ఇక మా ఏనుగుమార్కు ఇనప్పెట్టెగురించి వివరాలు: నువ్వు ప్రయోగం చేయబోయే దాని నిడివి ఆరడుగులు, వెడల్పు నాలుగడుగులు ఉంటాయి. పన్నెండు లీవర్ల తాళాలు రెండు ఉంటాయి. మా ఫాక్టరీలో ఎన్నో పరిశోధనలు చేసిన అనంతరం ఆ తాళాలను తయారు చేయించాం. ఐతే, ఒకటిమాత్రం నిజం. ఆ తాళాలను నువ్వు కాదుకదా — నీ తాతముత్తాతలు కూడా బలప్రయోగంమీద తెరవలేరు. నీకు అదొక సవాల్ అన్నమాట."

"ఇదేం సవాల్ లెండి ?"

"అలా అనకు. ఆ సవాల్లో నువ్వు నెగ్గావో—నీకు నూటపదహార్లు ఇనాంకాక మరో ఐదువందలు దక్కుతాయి. అంతే, ఆ ఇనప్పెట్టె లోపల ఒక సొరుగులో ఐదువందల రూపాయల నోట్లున్న ఒక కవరును ఉంచుతామన్నమాట. నువ్వా ఇనప్పెట్టె తలుపులను అదృష్టవశాత్తు తెరవగల్గితే నీ కా ఐదువందల రూపాయలూ దక్కుతాయి ఇది న్యాయార్జితమే కదా? ఏమంటావ్? ఇంత చక్కని అవకాశాన్ని జారవిడుచుకుంటావా? ఇందులో నువ్వు సంకోచించవలసిం దేముంది!"

"ఎందుకు లేదు, బాబయ్యా? అంత మంది ఎదుట నే నాపెట్టె తాళాలు పగలగొట్టి, ఆ ఐదువందలను చేజిక్కించుకుంటే — అది నేరం ఎందుకు కాదు? పైగా, ఆరోజు పోలీసోళ్ళుకూడా వస్తారని మీ రన్నారాయె...."

"ఐతే, ఆ ఇనప్పెట్టెను తెరవగలనన్న నమ్మకం నీ కుందన్నమాట; కాని, మాకు లేదు....ఇంతకీ, నువ్వు ఒప్పుకున్నట్లా—లేదా?"

"మరి, ముందుగా మీరు నా కొకటి రాసివ్వాలి."

"ఏమని?"

"మీ రా ఇనప్పెట్టెలో ఉంచే ఐదువందలు నాకు దక్కితే, నామీద ఏ కేసూ ఉండదని రాసివ్వాలి."

"నీమాటే నీకు....సరే—రాసిస్తాలే... ఇదో ప్రస్తుతానికి ఈ పదహారు రూపాయలు అడ్వాన్సుగా నీవద్ద ఉంచుకో. మిగతా వందరూపాయలను మే మా ప్రదర్శనను ఏర్పాటు చేసినరోజున ఇస్తాం. నువ్వారోజు శుభ్రంగా గడ్డం గీసుకొని, కాస్త మంచిబట్టలు వేసుకొని సిద్ధంగాఉండు, నీకోసం కారుపంపిస్తాంలే."

"ఏమిటో ... ఆ ఇనప్పెట్టెలు తెరిచే వృత్తిని మానేశానని ఎంత మొత్తుకున్నా మీరు విన్నారు కాదు."

"నా మాట నువ్వు విన్నావు. మా కంతేచాలు. ఇది ఉభయులకూ లాభదాయకం. మా ఇనప్పెట్టెలకు గిరాకీ హెచ్చుతుంది; నీకు నూటపదహార్లు ముట్టుతాయి."

"మరో ఐదువందలుకూడా దక్కుతుంది లెండి."

"అదేమిటో చూస్తాంగా! ... ఆ ఐదువందలు ఉన్న కవర్ను నీ చేతనే ఆ ఇనప్పెట్టెలో పెట్టిస్తా. ఎలా దక్కించుకుంటావో చూస్తా...సరే...ఇక వస్తా." అంటూ బ్రహ్మయ్య అమితోత్సాహంతో అక్కణ్ణించి బయలుదేరాడు.

* * *

ఈ 'స్వామి అండ్ బ్రహ్మయ్య' కంపెనీ బిజినెస్ స్టంట్ తమాషా ప్రజలలో నిజంగానే పెద్ద సంచలనం కలిగించింది.

ఆనాడు ఆ కంపెనీ పై అంతస్తు మీది డాబా, 'రూఫ్ గార్డెన్'లా తయారైంది. రంగు రంగుల తోరణాలతో, మిరుమిట్లు గొలిపే దీపాలతో నేత్రోత్సవంగా ఉంది. ఒక వైపున చిన్న ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేశారు. దాని మీద ఏనుగు బొమ్మ, ప్రక్కన ఏనుగు మార్కు పెద్ద ఇనప్పెట్టెను ఉంచారు.

ఐదుగురు స్థానిక పత్రికల ప్రత్యేక విలేఖరులు వచ్చారు. నెల్లూరు నించి ఒక అపరాధ పరిశోధక కథల మాస పత్రిక సంపాదకుడు స్వయంగా పని కట్టుకుని ఈ తమాషా ఏమిటో చూడడానికి వచ్చాడు. ఎందరో ధనికులు, వ్యాపారులు, ప్రభుత్వోన్నతోద్యోగులు కూడా కొందరు హాజరయ్యారు. ఆ వీధిలో ఉండే మరికొందరు ఇనప్పెట్టెల వర్తకులు కూడా వచ్చారు. వాళ్ళందరూ దొంగ వీరడికే విజయం లభించాలనీ, తమ పోటీదారులైన 'స్వామి అండ్ బ్రహ్మయ్య' కంపెనీకి ఓటమి లభించాలనీ భగవంతుని పదే పదే ప్రార్థిస్తూ కూర్చునున్నారు.

పోలీస్ అసిస్టెంట్ కమీషనర్, ఒక ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుల్స్‌తో వచ్చారు. వాళ్లను చూడగానే దొంగ వీరడు తలను మోచేతుల్లో దాచుకొని కుర్చున్నాడు. అది గమనించిన బ్రహ్మయ్య–అతిథులకు స్వాగతమిస్తూ హడావిడిగా ఇటు అటు తిరుగుతూన్న వాడల్లా హఠాత్తుగా వీరడి దగ్గరికి వచ్చి, అభయమిస్తూన్నట్లు అతని భుజంమీద మృదువుగా తట్టాడు.

ఆ రూఫ్ గార్డెన్ అంతకంతకు క్రిక్కిరిసి పోతూఉంది. అందరికీ కూల్ డ్రింక్‌లు సర్వ్ చేయబడుతున్నాయి. నిర్ణీత సమయం సమీపించేకొద్దీ ఒక వైపునించి గుసగుసలు, మరొక వైపునించి పకపకలు వినిపిస్తున్నాయి. చివరికి బ్రహ్మయ్య ఠీవిగా వేదికమీదికి వెళ్లి నిలుచున్నాడు. "జంటిల్‌మన్...ప్లీజ్!" అన్నాడు.

సద్దు మణిగింది.

"మా ఆహ్వానాన్ని మన్నించి సభను అలంకరించిన ప్రముఖు లందరికీ మా ధన్యవాదాలు. విశేష మేమిటో ఆహ్వాన పత్రికల్లో విశదంగా తెలియపరిచాం గనుక, ఇక అనవసరంగా కాలయాపన కాకుండా అసలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. నాకు కుడిప్రక్కన ఉన్నది మా కార్ఖానాలో అనేక పరిశోధనలు సల్పిన అనంతరం తయారు చేయబడిన ఇనప్పెట్టె – ఏనుగు మార్కు ఇనప్పెట్టె నమూనా ఉంది. బరువు - పది హేను వందల డెబ్భయి పౌండ్లు. ఇదెంత శ్రేష్టమైనదో కాస్సేపట్లో చూడబోతున్నారు... ఇక నేటి గౌరవ అతిథి..." అంటూ బ్రహ్మయ్య ఇటు అటు చూశాడు.

వీరడిని ఆ కంపెనీలో భాగస్థుడైన స్వామి తీసుకొచ్చి, వేదిక మీదికి ఎక్కించాడు.

బ్రహ్మయ్య ఒకసారి గొంతు సవరించుకొని, "ఇప్పుడు నా ఎడమవైపున ఉన్న వ్యక్తి వీరయ్య. ఈయన ఇప్పటి బరువు నూట ఇరవై నాలుగు పౌండ్లు. లోగడ ఇంతకు రెట్టింపు బరువు ఉండే వారేమో!" అంటూ నవ్వాడు.

ఇంతలో వీరయ్య మీద స్పాట్ లైటు పడింది. వీరయ్య తలవంచుకున్నాడు.

"ఈ వీరయ్య గురించి నేనిప్పుడు కొత్తగా చెప్పవలసిందేమీ లేదు. ఎంతటి ఇనప్పెట్టెనయినా ఇట్టె తెరిచేయడంలో తనకు తానే సాటి అని ఏనాడో ఖ్యాతి గాంచాడు."

బ్రహ్మయ్య ఆగాడు. సభలో కరతాళ ధ్వనులు మిన్నముట్టాయి. అందరితో పాటు ఇన్‌స్పెక్టర్ కూడా చప్పట్లు కొట్టేవాడేమో కాని, అసిస్టెంట్ కమీషనర్ తన వంక ఓరకంటితో చూడడంతో అందుకు సాహసించలేకపోయాడు.

బ్రహ్మయ్య పరుగెత్తి, "కాని, మా ఏనుగు మార్కు ఇనప్పెట్టెముందు ఈ వీరయ్య పప్పు లేవీ ఉడకవని మా నమ్మకము. అందుకే మేం ఛాలెంజ్ చేస్తున్నాము," అంటూ వీరడి వైపు తిరిగి, దగ్గరికి రమ్మని సైగ చేశాడు. తర్వాత తన కోట్ జేబులోంచి ఒక కవర్‌ను బయటకు తీసి, "వీరయ్యా, ఈ కవర్‌లో ఐదు వంద రూపాయల నోట్లున్నాయి. కావలిస్తే, పరిశీలించి చూడొచ్చు," అన్నాడు తగ్గుస్థాయిలో.

"అబ్బే – ఇందాకే చూశాకదండీ?" అన్నాడు వీరడు.

"ఫరవాలేదు. ఈ కవర్‌ను తీసుకో. దీన్ని నువ్వే ఈ ఇనప్పెట్టెలో ఉంచు. ఉంచి, ఇనప్పెట్టెను, దాని తాళంచెవులను పరీక్షించుకోవచ్చు," అన్నాడు.

వీరడు ఇనప్పెట్టెను పరిశీలిస్తుండగా బ్రహ్మయ్య మళ్ళీ ప్రేక్షకులవంక తిరిగి, "మహాజనులారా, మరోమనవి. ఇప్పుడు మీ ఎదురుగా ఉన్న ఈ వీరయ్య మునుపటి దొంగవీరడుకాదు. ఇనప్పెట్టెలను పగులగొట్టి చోరీలు చేసే వృత్తికి తిలోదకాలు ఇచ్చేశాడు. ఇప్పుడు మా కోర్కె మీదే ఈ ఇనప్పెట్టెను తెరవడానికి అంగీకరించాడు. మీరు ఎన్నో బాక్సింగ్, మల్లయుద్ధం పోటీలు చూసిఉండొచ్చు. ఇప్పుడు ఈ వీరయ్య మా ఇనప్పెట్టెతో కుస్తీ పట్టబోతున్నాడు. అతను జయించిన పక్షంలో ఆ ఇనప్పెట్టెలో ఉంచిన ఐదు వందల రూపాయలు అతనికి దక్కుతాయి. లేదా, మేం జయించిన వారమౌతాము. తన్మూలంగా మా ఇనప్పెట్టె గజదొంగలకుసైతం లొంగని ఎంతటి సురక్షితమైనదో మీరు ప్రత్యక్షంగా తెలుసుకుంటారు," అంటూ వీరడివైపు తిరిగి, "నువ్వు సిద్ధంగా ఉన్నావా? సరే, ఆ ఇనప్పెట్టె తాళాలు బిగించి,

"తాళం చెవులు నాకు అందివ్వు." అన్నాడు. వీరడు అలా చేయగానే "సరే... ఇక నీ పనిని ప్రారంభించు," అంటూ బ్రహ్మయ్య వేదికమీదినించి దిగివచ్చి, మొదటివరుసలో ఉన్న ఒక ఖాళీకుర్చీలో ఉస్సురుమంటూ కూర్చున్నాడు.

ఇంతలో ఆ కంపెనీలో భాగస్వామి అయిన స్వామి ఒక తోలుసంచీని వీరడికి అందజేసి, దిగివచ్చేశాడు

వీరడు ఆ సంచీలోంచి ఒక సుత్తి, ఎలక్ట్రిక్ కొలిమి, బరమ, స్క్రూడ్రైవర్ ఇత్యాదులను బయటకు తీసి, ఒక్కొక్కటిగా పరిశీలించాడు. తర్వాత అందులో ఉన్న గ్లోవ్స్‌ను రెండుచేతులకూ తొడుక్కున్నాడు.

అక్కడంతా నిశ్శబ్దం ఆవరించింది. అందరూ గుడ్లప్పగించి, వీరడివంకే చూస్తున్నారు.


వీరడు సుత్తిని, స్క్రూడ్రైవర్‌ను చేతబట్టి, ఇనప్పెట్టెముందుగా వెళ్ళి నిలుచున్నాడు. రెండు నిమిషాలపాటు తీక్షణంగా పరిశీలించాక, సుత్తితో తలుపు మీద కొట్ట ప్రారంభించాడు.

ఆ ధ్వని భరించలేక సభికుల్లో కొందరు చెవులు మూసుకున్నారు. 'స్వామి అండ్ బ్రహ్మయ్య' కంపెనీకి ఇనప్పెట్టెల వ్యాపారంలో పోటీదారుడైన ఒక వర్తకుడు కళ్ళు మూసుకొని, వీరడికే విజయం లభించాలని, అరమోడ్పు కనులతో భగవంతుని ప్రార్థిస్తూ కూర్చుండిపోయాడు.

సుత్తిచప్పుడు ఆగిపోయింది. వీరయ్య పెదవి విరుస్తూ, బరమాను చేతికి తీసుకుని, మళ్ళీ తన పనిలో తాను నిమగ్నుడయ్యాడు.

ఇంతలో ఒక పత్రికా ఛాయాగ్రాహకుడు ఫ్లాష్‌తో వీరడి ఫోటోలు రెండు మూడు తీశాడు.

బ్రహ్మయ్య లేచి నిలుచొని, "అయిదు నిమిషాలు గడిచాయి. ఈ వీరయ్యకు




మేమిచ్చిన టైమ్ రెండు గంటలు మాత్రమే. అతని పనిలో అత నుంటాడు. సభికులకు విసుగు కలగకుండా ఉండడానికి కాస్సేపు రికార్డుల సంగీతం వినిపిస్తాం," అంటూ కూర్చున్నాడు.

వెంటనే అక్కడక్కడ అమర్చిన స్పీకర్లలోంచి సినిమాపాటలు వినిపించసాగాయి.

ఆ సంగీతం హోరులో వీరడు చేసే చప్పుడు స్పష్టంగా వినిపిస్తూనే ఉంది. వీరడు బరమాను కిందపెట్టేసి, ఎలక్ట్రిక్ కొలిమిని చేతికి తీసుకున్నాడు. దాని చివరను ప్లగ్‌లో ఉంచాక ఆయాసపడుతూ ఇనప్పెట్టె పక్కగా చక్కగా నిలుచున్నాడు. స్పాట్‌లైట్ కాంతిలో అతని ముఖంమీది స్వేదబిందువులు స్పష్టంగా తెలుస్తున్నాయి.

బ్రహ్మయ్య లేచి, "పావుగంట దాటేసింది," అనేసి మళ్ళీ కూర్చున్నాడు.

ప్రేక్షకులకు ఐస్‌క్రీములు సప్లయ్ చేయబడ్డాయి. స్పీకర్లలోంచి రికార్డుల సంగీతం యథావిధిగా వినిపిస్తూనే ఉంది. అప్పుడప్పుడు ఫ్లాష్ బల్బులు వెలుగుతున్నాయి.

"కమాన్, వీరయ్యా!" అని ఇనప్పెట్టెల పోటీ వర్తకు డొకడు పొలికేకెట్టాడు.

అసిస్టెంట్ కమీషనర్ దూరదర్శినితో వీరడ్ని పరికిస్తూన్నవాడల్లా చివాలున తన దృష్టిని ఆ కేక వేసిన వ్యక్తికేసి మరల్చాడు.

ఇనప్పెట్టె తాళంమీద కొలిమితో ఎర్రగా కాల్చాక వీరడు అందులో స్క్రూడ్రైవర్‌ను ఉంచి, సుత్తితో కొట్టసాగాడు. పొరపాటున ఒకసారి సుత్తితో తన చూపుడువేలిమీద కొట్టుకున్నాడు.

ఎవరో ఫకాలున నవ్వారు.

వీరయ్యలో ఆవేశం హెచ్చు పెరిగింది. సుత్తితో అదేపనిగా దబదబ బాదసాగాడు. ఈ మారు సుత్తి జారి అతని కుడికాలిమీద పడింది. బొటనవేలు గాయమైంది. బ్రహ్మయ్య వెంటనే లేచి వెళ్ళి ప్రథమచికిత్స చేసినఅనంతరం "వీరయ్యా, ఒక గంట గడిచింది. ఇంకొక్క గంట వ్యవధి ఉంది. నువ్వో అయిదునిమిషాల పాటు విశ్రాంతి తీసుకుంటావా?" అని అడిగాడు.

"అక్కర్లేదు బాబయ్యా... నలుగురిని సాయం పిలిచి, ఈ ఇనప్పెట్టెను పడుకోబెట్టిస్తారా?" అన్నాడు వీరడు.

అలాగ ఇనప్పెట్టు ఉంచబడింది. వీరడు ఈమారు పనిముట్లన్నిటితోసహా దాని మీద కూర్చొని, తన నేర్పరితనాన్ని శత విధాల ప్రయోగించసాగాడు.

మరో అరగంట గడిచింది.

"వీరయ్యా, ఇకనైనా నీ ఓటమిని ఒప్పుకుంటావా?" అని బ్రహ్మయ్య లేచి అడిగాడు.

"ఊహుఁ," అని తల విదిలించి వీరడు మరింత రోషంతో, పట్టుదలతో ప్రయత్నించసాగాడు.

ప్రేక్షకుల్లో ఇద్దరు ముగ్గురికి మరింత బోర్ కొట్టిందేమో లేచి చల్లగా జారుకున్నారు.

వీరడు బాగా అలిసిపోయాడు. రొప్పుతూ రోజుతూనే ఉన్నాడు కాని, తన ప్రయత్నాన్ని విరమించలేదు. అతని కిచ్చిన వ్యవధి ముగియడానికి ఇంకో అయిదునిమిషా లుండనగా బ్రహ్మయ్య రికార్డుల సంగీతాన్ని ఆపుచేయించి, తన రిస్ట్‌వాచ్ వంకే చూస్తూండిపోయాడు. ఇక నాలుగు నిమిషాలే ఉన్నాయి...మూడు నిమిషాలు ... రెండు ... ఇంకొక్క నిమిషమే ఉంది...ముప్ఫై సెకెండ్లు...అయిపోయింది!'' అంటూ బ్రహ్మయ్య అమాంతంగా ఎగిరి గంతేసి నిలుచున్నాడు.

అప్పటికి వీరడు తూలి పడబోయినవాడల్లా తమాయించుకొని ఇనప్పెట్టెకు అనుకున్నాడు. తన ఓటమికి అంగీకార సూచకంగా తల వాల్చేశాడు. వెంటనే అతనిమీద అయిదారు ఫ్లాష్ బల్బులు టపటప మని వెలిగాయి.

బ్రహ్మయ్య ఆనందోద్రేకంతో ప్లాట్‌ఫామ్‌మీదికి వెళ్ళి నిలుచొని, "విజయం మాదే! విజయం మా ఏనుగుమార్కు ఇనప్పెట్టెదే!" అని అరుస్తూ, రెండు చేతులూ పైకెత్తేశాడు.

వాళ్ళ కంపెనీకి పోటీదారులైన కొందరు ఇనప్పెట్టెల వర్తకులు ఎప్పుడో అక్కడ్నించి నిష్క్రమించారు.

చివరికి, ఆహూతులందరికీ కృతజ్ఞత లర్పిస్తూ బ్రహ్మయ్య వందన సమర్పణ చేయడంతో ఆ వేడుక ముగిసింది.

అందరూ వెళ్ళిపోయాక బ్రహ్మయ్య, వీరడికి కూల్‌డ్రింక్ ఇచ్చి, "ఇదో మేం నీకు ఇస్తామన్న వందరూపాయలు. కృతజ్ఞలతో అర్పిస్తున్నాం. స్వీకరించు. కాని, నువ్వు ఇనప్పెట్టెను తెరిచి, ఆ ఐదువందల రూపాయిల ఛాలెంజ్ మొత్తాన్ని స్వీకరించలేకపోయినందుకు మా కంతా చాలా విచారంగా ఉంది," అన్నాడు.

"నాకేం విచారం లేదు ... వస్తా," అంటూ వీరయ్య సెలవు తీసుకున్నాడు.

*　　　*　　　*

"కొంప మునిగింది!" అంటూ బ్రహ్మయ్య తేలుకుట్టిన దొంగలా పెడబొబ్బ లెట్టసాగాడు.

"ఏమిటి! ఏమైంది?" అంటూ స్వామి హడావిడిగా వచ్చాడు.

"ఈ కవర్‌లో ఐదువందల రూపాయల నోట్లను నేనుంచాగా? దీన్ని వీరడిచేతనే ఈ ఇనప్పెట్టెలో పెట్టించా. ఇప్పుడీ కవరు ఖాళీగా ఉంది!"

"ఆఁ! మరి దీని తాళంచెవులు ఇప్పటి వరకు నీ దగరే ఉన్నాయి. నువ్వుకూడా దీన్ని ఇప్పుడే తెరిచావు."

బ్రహ్మయ్య నెత్తి బాదుకుంటూ, "ఆ దొంగవీరడు ఇనప్పెట్టెలు తెరిచే వృత్తికి స్వస్తి చెప్పానన్నాడు. అంటే, వాడిప్పుడు పిక్‌పాకెట్‌గా డయ్యాడన్న మాట! నే నీ నోట్లుంచిన కవర్‌ను ముందే చూశాడు కదూ? పనిముట్లు తీసుకురావడానికి వెళ్ళినప్పుడు అలాంటి ఖాళీ కవర్ నే ఎక్కడో సంపాదించి ఉంటాడు. నేనేమో మహాఠీవిగా ఆ కవర్‌ను ఇనప్పెట్టెలో పెట్టమని అతనితోనే చెప్పానా? ఆ సందడిలో అతనెప్పుడో కవర్‌లను తారుమారు చేసి, మనందరి కళ్ళల్లో దుమ్ముకొట్టిపోయాడు. ఇప్పుడతన్ని మనం ఏం చేయగలం? అంతమంది ఎదుట—అందులో పోలీసువారి సమక్షంలోనే ఇంత పచ్చి మోసమా?" అంటూ గుడ్లు తేలవేశాడు.

"ఊఁహుఁ...మన మింకేమీ చేయలేము. గుట్టు చప్పుడు కాకుండా ఊరుకోవలసిందే. బయటకు చెప్పుకుంటే సిగ్గుచేటు."

"అంతే నంటావా?" అంటూ బ్రహ్మయ్య ఏడ్పుముఖం పెట్టాడు.

"అంతే...విజయం మన ఇనప్పెట్టెదే అయినా—ఓటమి మనదే నన్నమాట..." అంటూ స్వామి కూడా నెత్తి బాదుకున్నాడు.

